# సుబ్బారావు - వంటమనిషి



-కె. మధుసూదన్

సుబ్బారావు నా ప్రాణస్నేహితుడు. వాడ్ని చూడక చాలా కాలం అవడంతో వాడ్ని చూసేందుకు విజయవాడ వెళ్లాను. వాడు అక్కడ ఎమ్మే చదువుతున్నాడు. తండ్రికి ఒక్కగానొక్క కొడుకు. వాడూ నేనూ కలిసి స్కూల్ ఫైనల్ నుండి బి.ఏ వరకు చదువుకున్నాము. మా ఇద్దరిది ఒకే ఊరు అవుడంతో ఇంటర్ నుంచి బి.ఏ వరకూ ఒకే రూమ్‌లో ఉంటూ ఒకే మంచంలో పడుకుని డిగ్రీ పూర్తి చేసాము.

మా నాన్నగారు గుండె పోటుతో మరణించడంతో ఇంటి బాధ్యత, వ్యాపార బాధ్యతలు అన్నీ నాపై పడడంతో చదువుకి స్వస్తి పలికాను.

వ్యాపార పనుల వల్ల తరుచుగా విజయవాడ వెళ్లినప్పుడల్లా వాడి దగ్గరకు వెళ్లి హాయిగా గడపడం నాకు అలవాటు. అయితే ఈ మధ్య వ్యాపార లావాదేవీలు లేకపోవడంతో అక్కడికి వెళ్లలేకపోయాను. తోటి వ్యాపారి కుమార్తె పెళ్లి విజయవాడలో జరగడంతో అక్కడికి వెళ్లాల్సి వచ్చింది.

నేను విజయవాడ వెళ్లేసరికి వాడు ఇంట్లో కనిపించలేదు. స్నానానికి వెళ్లాడేమో అనుకుని డ్రాయింగ్‌రూమ్‌లో కూచుని పేపరు తిరగేయసాగాను. ఇంతలో మెరుపు లాంటి ఓ అమ్మాయి ప్రత్యక్షమైంది. ఆ అమ్మాయికి దాదాపు పదహారు సంవత్సరాలుంటాయి. ముఖంలో మంచి ఆకర్షణ వుంది. ఆ అమ్మాయి ఎవరా? అన్న ఆలోచనలో వుండగా మా సుబ్బారావు నా భుజంపైన చెయ్యి వేసి "ఎప్పుడు వచ్చావ్? మన వాళ్లంతా క్షేమమేనా?" అన్న ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చాను.

"మా వాళ్లంతా కులాసాయే! అసలు నీ కథేమిటి"? అనుమానంగా అడిగాను.

దానికి వాడు ఈ మధ్య నా ఆరోగ్యం బాగుండడంలేదురా! హోటల్ తిండి పూర్తిగా పడటంలేదు. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. దాంతో వంట మనిషిని పెట్టుకున్నాను. ఇందాక నువ్వు చూశావే ఆవిడే వంటమనిషి " అని చెప్పాడు.

దాంతో నాకు వాడిమీద బోలెడంత కోపం వచ్చింది. 'అరే! సుబ్బారావు!' వంటమనిషిగా పదహారేళ్ల కన్నె పిల్ల తప్ప మరెవ్వరూ దొరకలేదా? నువ్వు నిజంగా వంట కోసమే పెట్టుకున్నావా?' అనుమానంగా అంటూ 'నువ్వు ముమ్మం దు ప్రమాదంలో చిక్కుకుంటావ్ జాగ్రత్త!' అంటూ హెచ్చరించి బయలుదేరాను.

నేనో పిచ్చి వెధవనని తన అవసరానికి వంటమనిషిని పెట్టుకుంటే! ఏవో ఊహించుకుంటున్నానని అనుకున్నాడు సుబ్బారావు. రోజులు సజావుగా దొర్లిపోతున్నాయి. వంటమనిషి వంట బ్రహ్మాండంగా ఉంది. రోజుకో వంట. రోజుకో రకం టిఫిన్ చేసి పెడుతోంది. అలా తినడంతో కాస్త లావెక్కాడు సుబ్బారావు.

ఓ రోజు సుబ్బారావు ఇంటికి ప్రసాద్ అనే స్నేహితుడు వచ్చాడు. వాడి కాలేజి ఫ్రెండ్. బాగా క్లోజ్. వాడు వచ్చేసరికి స్నానం చేస్తున్నాడు సుబ్బారావు. వంటమనిషి డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూర్చుని దర్జాగా సినిమా పత్రిక తిరగేస్తోంది. వాడు మొదట ఈవిడగారిని చూసి కంగారు పడి ఆ తర్వాత తేరుకుని మాటల మధ్యలో 'మా సుబ్బారావు మీకేం అవుతారండీ?' అని అడిగాడు. దానికి ఆవిడ గర్వంగా చాలా దగ్గరి బంధువని చెప్పిందట. వాడు ఆ మర్నాడు కాలేజిలో కలిసి 'అరే! నిన్న నీ రూమ్‌కు వచ్చేసరికి నువ్వు స్నానం చేస్తున్నావని నీ మరదలు చెప్పింది. అర్జంట్ పని వుండటంతో నిన్ను కలవకుండా వచ్చేసాను. వివాహానికి ముందే మరదలితో కాపురం పెట్టావురా? మొత్తానికి అదృష్టవంతుడివి. మాకంత అదృష్టం లేదు' అన్నాడు ప్రసాద్.

మరదలా? వాడన్న మాట అర్థంకాక అడిగాడు సుబ్బారావు. 'ఆ మధ్య నువ్వు చెప్పావు గుర్తుందా? నాకో మరదలుందని, ఆవిడ చాలా అందంగా వుంటుందని , నీ మరదలు మంచి మాటకారోయ్! ' అంటూ భుజం తట్టి వెళ్లాడు.

ఓసారి దూరపు బంధువు ఒకాయన రూమ్‌కొచ్చి వంటమనిషిని చూసి 'నాయనా! సుబ్బారావు! నీకు పెళ్లి అయిన సంగతి నాకు ఇంతవరకు తెలియదు. మీ నాన్నగారు నాకు శుభలేఖ పంపడం మరిచిపోయారేమో!'అని అన్నారు. ఏం చెప్పాలో తోచక సిగ్గుతో తలవంచుకున్నాడు.

ఆ క్షణంలో ఏం చెప్పినా ఆయన నమ్మేట్టు లేదు. ఆ పరిస్థితి అలాంటిది. అవసరానికి వంటమనిషిని పెట్టుకుంటే లేనిపోని చిక్కులు వస్తున్నాయి. ఈ వంటమనిషి కూడా ఇలా ప్రవర్తిస్తుందేమిటి? అసలు దీని ఉద్దేశ్యం ఏమిటి? పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్టు ఈ ఆరోపణ లేమిటి? అంటూ మదనపడసాగాడు. ఒక రోజు సుబ్బారావు నాన్నగారి స్నేహితుడు బజారులో కలిసి 'ఏమిటోయ్! ఈ మధ్య కథలు భాగా నడిపిస్తున్నావట?'అని అడగడంతో ఏమీ అనలేక సిగ్గుతో తలవంచుకున్నాడు.

ఇలా ఎన్నో వదంతులు ఉన్నవి లేనివీ ప్రచారం కాసాగాయి. ఇంటి ఓనర్ సైతం అనుమానంగా చూడసాగాడు.

ఇంతలో ఒకనాడు ఇంటి నుంచి పెద్ద ఉత్తరం వచ్చింది. దాంట్లో చీవాట్లు, మందలింపులు. ఇంక లాభం లేదనుకుని వంట మనిషికి దణ్ణం పెట్టిరెండు నెలలు జీతం అదనంగా ఇచ్చి మాన్పించాడు.

ప్రశాంతమైన మనస్సుతో, గుండెమీద నుంచి పెద్ద బరువు తొలగినట్లు ఫీలయిన సుబ్బారావు గత్యంతరం లేక మళ్లీ హోటల్ భోజనానికి ఉపక్రమించాడు.